క్లుప్తంగా

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

కె.కోటపాడు : స్థానిక హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను శనివారం అందించారు. ఇన్‌చార్జి హెచ్ఎం హిమబిందు, ట్రస్ట్ చైర్మన్ వెంకటరావు మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పొందాలని కోరారు. కార్యక్రమంలో బోకం ఎర్రునాయుడు, ఈశ్వరరావు, బొబ్బిలి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన డిప్యూటీ డీఈవో



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

నర్సీపట్నం: నర్సీపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తురకబడి)ని డిప్యూటీ డీఈవో అప్పారావు శనివారం ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరీక్షించారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను సంసిద్ధులను చేయాలన్నారు.

హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం

మాడుగుల రూరల్ : రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబును మండల పార్టీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆయన స్వగ్రామం వద్దాదిలో మండల పార్టీ అధ్యక్షుడు అద్దిపల్లి జగ్గారావు, ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, పార్టీకి చెందిన మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సత్కరించారు.

ఘనంగా మహిళా సంఘం వార్షికోత్సవం

తుమ్మపాల: జీవీఎంసీ విలీన గ్రామం కొత్తూరు నర్సింగరావుపేట రామాలయంలో సీతారామ మహిళా సేవా సంఘం పదో వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. సంఘ వ్యవస్థాపక కార్యదర్శి సూచికొండ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ సర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ విచ్చేసి సంఘ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం పది సెంట్ల స్థలం కేటాయించేలా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు రామాలయంలో సీతారాముల భజనలు చేశారు.

కార్మికుల సమస్యలపై కమిషనర్‌కు వినతి

నర్సీపట్నం: మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) నాయకుడు ఎ.రాజు తదితరులు మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. జనాభాకు తగ్గట్టు కార్మికులను నియమించాలని, పుష్కార్టులు, చీపుర్లు, తట్టలు, గ్లౌజులు, పనిముట్లు సరఫరా చేయాలన్నారు. పొంగల్ అలవెన్సు చెల్లించాలన్నారు. కేవీపీఎస్ నాయకులు ఈరెల్లి చిరంజీవి, మున్సిపల్ యూనియన్ నాయకులు వాసుపల్లి రమణ, చంటి పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారిణులు

కె.కోటపాడు : చౌడువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారంతో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14, 17 క్రీడా పోటీలు ముగిసాయి. రెండవ రోజు క్రీడాపోటీల్లో అండర్ 14, 17 విభాగంలో బాలికలకు పోటీలు నిర్వహించారు. మాడుగుల నియోజకవర్గంలో గల నాలుగు మండలాల నుండి 40 పాఠశాలల నుండి 350 మంది క్రీడాకారిణులు హాజరయ్యారు. వీరికి ఖో-ఖో, కబడ్డీ, టెన్నికాయిట్, వాలీబాల్, షటిల్, త్రోబాల్, బేస్‌బాల్, 100, 200, 800 మీటర్ల పరుగు పందాలు నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శనతో విద్యార్థినులు ఆకట్టుకున్నారు. ఎంఈవోలు సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్, పీఈటీ పోటీలను పర్యవేక్షించారు.

బాబుకు బుద్ధిని ప్రసాదించు స్వామీ

- వెంకన్నకు మొక్కుకున్న వైఎస్సార్‌సీపీ నేతలు
- హామీల అమలు నుంచి తప్పించుకోవడానికే కొత్త రగడ అని విమర్శ



మాడుగుల వేంకటేశ్వరాలయంలో నాలుగు మండలాలకు చెందిన నాయకులతో పూజల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం ముత్యాల నాయుడు



పార్టీ శ్రేణులతో కలిసి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

మాడుగుల : తిరుపతి ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ కూటమి నాయకులు హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా చేసిన తప్పుడు ప్రచారాలపై వేంకటేశ్వర స్వామే చూసుకోవాలని శనివారం స్థానిక వేంకటేశ్వర ఆలయంలో పాప ప్రక్షాళనకు మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో నాలుగు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో పూజలు నిర్వహించారు. పవిత్రమైన దేవుని ఆలయాలపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలు మానుకునేలా ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వామివారు బుద్ధి ప్రసాదించాలని కోరుకున్నారు. అనంతరం మాడుగుల మోదకొండమ్మ, దుర్గాదేవీ ఆలయాల్లో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాడుగుల ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, చీడికాడ మండల పార్టీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు, దేవరాపల్లి మండల పార్టీ అధ్యక్షుడు బూరే బాబూరావు, కె. కోటపాడు ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్, చీడికాడ జెడ్పీటీసీ లాలం శారద జానకీరామ్, ఎంపీపీ కురచ జయమ్మ నారాయణమూర్తి, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ,, మాజీ ఏఎంసీ చైర్మన్ శేనాపతి కొండలరావు, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, స్థానిక ఎంపీటీసీలు పాలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, సర్పంచ్ ఎడ్ల కళావతి, కుక్కర శ్రీధర్, ఎం. అశోక్, వార్డు మెంబర్ శీలామంతుల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



చోడవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న ధర్మశ్రీ

రాజకీయం చేయటం తగదు..

నర్సీపట్నం : తిరుమల తిరుపతి పవిత్రతను, ప్రసాదాన్ని సీఎం చంద్రబాబునాయుడు రాజకీయం కోసం అపవిత్రం చేయటాన్ని నిరసిస్తూ పాప ప్రక్షాళన జరగాలని శనివారం నియోజకవర్గ కేంద్రమైన నర్సీపట్నం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డిని నేరుగా ఎదుర్కొనే సత్తా లేక దేవుడిని రాజకీయాల్లోకి లాగుతున్నారని అన్నారు. పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రాపాత్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, ఎంపీపీలు గజ్జలపు మణికుమారి, రుత్తల లక్ష్మి, సాగిన లక్ష్మణమూర్తి, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, నాగేశ్వరరావు, రుత్తల శ్రీనివాసరావు, సుర్ల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు సుర్ల గిరిబాబు, కాపారపు అప్పలనర్స, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నీచ రాజకీయాలు చేయడం దారుణం..

దేవరాపల్లి : శ్రీ వేంకటేశ్వర స్వామిని అడ్డు పెట్టుకొని సీఎం చంద్రబాబు సహా కూటమి నాయకులు నీచ రాజకీయాలు చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ మాడుగుల నియోజకవర్గ సమన్వయకర్త ఈర్లె అనురాధ విమర్శించారు. తారువలో శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజా వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో ప్రజల దృష్టిని మళ్లించేందుకు శ్రీవారి లడ్డూ అంశానికి తెర లేపారన్నారు.



మాట్లాడుతున్న ఈర్లె అనురాధ

బాబు తీరు సిగ్గుచేటు..

బుచ్చెయ్యపేట : శనివారం వడ్డాది వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడలేదని టీటీడీ ఈవో శ్యామలరావు చెప్పినా ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న చంద్రబాబు నాయుడు రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు.



వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్ధనరావు, ఎంపీటీసీ కోరుకొండ లీలావతి రమణ, వార్డు మెంబర్లు గుమ్మిడి ప్రసాద్, అపా వరహాల బాబు, వెలుగుల అయ్యన్నదొర, పాఠశాల కమిటీ చైర్మెన్లు టి. మనోహర్, సీహెచ్ నాయుడు, వి. అప్పారావు, మాజీ సర్పంచ్ ఎస్. నానాజీ, సయ్యపు రెడ్డి కొండబాబు, కోవెల సత్యనారాయణ, చింతల శంకర్రావు పాల్గొన్నారు. పెదమదీనాలో జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కె. అచ్చం నాయుడు, గ్రామాధ్యక్షుడు కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

హామీల అమలు నుంచి తప్పించుకోవడానికే..

చోడవరం : చోడవరం పట్టణంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శనివారం మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పవిత్ర పూజలు నిర్వహించారు. ధర్మశ్రీతోపాటు ఆ పార్టీ నాయకులంతా శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని అభిషేకాలు చేశారు. తిరుపతి లడ్డూకి భక్తుల్లో ఎంత పవిత్రత ఉందో చంద్రబాబుకి తెలియకపోవడం చాలా విచారకరమని ధర్మశ్రీ అన్నారు. హామీల నుండి ప్రజల దృష్టి మరల్చేందుకే బాబు ఈ కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు.

ఇళ్ల నిర్మాణాలకు ఉచిత ఇసుక సరఫరా చేయాలి

కె.కోటపాడు : పీఎంఏవై పథకంలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు పొందిన లబ్ధిదారులు మార్చి నెలాఖరులోగా వాటిని పూర్తి చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్ లబ్ధిదారులకు సూచించారు. ఈ నేపథ్యంలో ఇళ్ల నిర్మాణదారులకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు కోరారు. అగనంపూడి ఇసుక డిపో నుండి తీసుకు రావాలంటే రూ.10 వేలు, బ్లాక్‌లో కొనుగోలు చేయాలంటే రూ.4 వేలు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికైనా అధికారులు లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక అందించి పనులు వేగవంతమయ్యేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.



కొరువాడలో మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మికి సమస్య వివరిస్తున్న గోవిందరావు

లబ్ధిదారులకు అవగాహన

గొలుగొండ: చీడిగుమ్మల గ్రామంలో గృహ నిర్మాణదారులతో మండల ప్రత్యేక అధికారి మోహనరావు సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఎంతమంది లబ్ధిదారులు ఉన్నదీ తెలుసుకున్నారు. మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జరిగింది. జెడ్పీటీసీ సభ్యుడు సుర్ల గిరిబాబు మాట్లాడుతూ మండలంలో డ్రైనేజీలు, సీసీరోడ్లు, తాగునీటి సదుపాయం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే వాటిని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లెక్కల అప్పలనాయుడు, సర్పంచ్ కాపారావు చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



చీడిగుమ్మలలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి మోహనరావు

గృహ నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలి..

మాకవరపాలెం : గత ప్రభుత్వంలో మంజూరైన గృహాలను వెంటనే నిర్మించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సీతామహాలక్ష్మి సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ లబ్ధిదారులతో శనివారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తామరం సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ నాటికి లింటల్, రూఫ్ లెవెల్‌లో ఉన్న ఇళ్లను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి..

దేవరాపల్లి : పక్కా ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి వి. రవీంద్రనాథ్ సూచించారు. మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో భాగంగా దేవరాపల్లి లేఔట్‌లో లబ్ధిదారులతో ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ ఎస్. భవ్యతేజ అధ్యక్షతన శనివారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులంతా తక్షణమే ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు.

మామిడిపల్లి, తిమిరాంలలో జరిగిన అవగాహన సదస్సుల్లో స్థానిక ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజు పాల్గొని లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు రెడ్డి సూర్యనారాయణ, కర్రి సూరినాయుడు, సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ సభ్యులు పంచాడ సింహాచలంనాయుడు, మొల్లి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి ఇళ్లను పూర్తి చేయాలి..

రోలుగుంట : మన ఇల్లు- మన గౌరవం అనే అంశంపై శనివారం రోలుగుంటలో సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి బి. రామోహన్‌రావు ఆధ్వర్యంలో గృహ లబ్ధిదారులకు అసంపూర్తిగా వున్న ఇళ్లను త్వరతగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. మండలంలో 17 లేఅవుట్లలో 346 గృహాలు మంజూరు కాగా, అందులో ఇంకా 92 గృహాలు వివిధ స్థాయిల్లో ఉన్నాయని, వచ్చే ఏడాది మార్చిలోపు వాటిని పూర్తి చేయాలని తెలిపారు.

ఘనంగా అన్నసమారాధన

మాడుగుల రూరల్ : గణేశ్ ఉత్సవాలలో భాగంగా మాడుగుల సంతబయలు ఆవరణలో శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. క్రిమినల్ బాయ్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

కె.జె.పురం భజన బృందం సభ్యులకు టీటీడీ ఆహ్వానం

మాడుగుల రూరల్ : మండలంలోని కె.జె.పురం గ్రామానికి చెందిన భజన బృందం సభ్యులు టీటీడీ ఆహ్వానం మేరకు తిరుపతిలో జరిగే అఖండ హరి నామ సంకీర్తనలో పాల్గొన్నారు. ఈ నెల 25వ తేదీన ఇక్కడి నుంచి తిరుపతి బయలుదేరి వెళ్లారు. మూడు రోజుల పాటు సంకీర్తనలో పాల్గొన్నారు. వీరికి సాలాపు జగన్నాథరావు, పిల్లా రాము నాయకత్వం వహించారు. వీరికి మూడు రోజుల పాటు ఉచిత వసతి, భోజన ఏర్పాట్లను తిరుమల తిరుపతి దేవస్థానం వారే చేశారు.

వ్యాక్సిన్‌తోనే ర్యాబిస్ కట్టడి

కె.కోటపాడు : కుక్క కాటు బారిన పడిన వారు తప్పకుండా నాలుగు డోసుల వ్యాక్సిన్ వేయించుకోవాలని వైద్యాధికారిణి తరణి అన్నారు. గుల్లేపల్లిలో ప్రపంచ ర్యాబిస్ డే సందర్భంగా శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీలలో ర్యాబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు, ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఏఎన్ఎం లక్ష్మి పాల్గొన్నారు.

ఆమోదించిన పనులకే ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎంపీడీవో పార్థసారధి

నాతవరం: గ్రామసభలో ఆమోదించిన పనులకే అధిక ప్రాధాన్యత ఇస్తామని ఎంపీడీవో పోలుపర్తి పార్థసారధి అన్నారు. శనివారం సర్పంచ్ గొలగాని రాణి అధ్యక్షతన జగనన్న లేఅవుట్లు కాలనీలో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో భాగంగా గ్రామ సభ నిర్వహించి హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సభలు నిర్వహించామన్నారు. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు బిల్లులు చెల్లించేందుకు అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తారన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీను, మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బంగారు సూరిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడు బూడికి సన్మానం



బూడి ముత్యాలనాయుడిని సన్మానిస్తున్న మండల నాయకులు



తారువలో బూడిని సత్కరిస్తున్న నాయకులు

చీడికాడ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడిని మండల నాయకులు శనివారం మాడుగులలో అభినందించారు. మండల పార్టీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు ఆధ్వర్యంలో స్థానిక ఎంపీపీ కురచా జయమ్మ, నారాయణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు లాలం శారద జానకీరామ్, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కొండబాబుతో పాటు మండల యూత్ విభాగం అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, సర్పంచ్‌లు చుక్కా అప్పలనాయుడు, శరగడం సన్యాసినాయుడు, బోడాల రమాదేవి శ్రీనివాస్, సలాది గంగేషు, పడాల అప్పలనాయుడు, పాటూరి రమణ తదితరులు పాల్గొన్నారు.

'బూడి'కి అభినందనల వెల్లువ..

దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుకు పార్టీ శ్రేణులు అభినందనలు తెలిపారు. దేవరాపల్లి మండలంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయుకులు, కార్యకర్తలు శనివారం అధిక సంఖ్యలో తరలివచ్చి ఆయనను అభినందించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, ఎ. కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వరదపురెడ్డి లలితానాయుడు, సర్పంచ్‌లు దాడి జగన్, రొంగలి వెంకటరావు, నాగిరెడ్డి శరారి నాయుడు, టోకురి రామకృష్ణ, గంధం రామకృష్ణ, చల్లా నాయుడు, బండారు దేముడు నాయుడు, కాటిపాం పెదనాయుడు, వంటాకు శ్రీను, మతల మధు, పోతల రఘు, గూడెపు మోహన్, బండారు ప్రసాదరావు, ఎంపీటీసీ పోతల వెంకటరావు, కె.ఎస్. అప్పలనాయుడు పాల్గొన్నారు.

జాషువా జీవితం స్ఫూర్తిదాయకం



జాషువా జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శాస్త్రి



తూటిపాలలో భగత్‌సింగ్‌కు సెల్యూట్ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మాడుగుల రూరల్ : కవి కోకిల, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.బి.ఎస్.ఎస్. శాస్త్రి జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జాషువా రచనలు, ఆయన జీవితాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, తెలుగు ఉపన్యాసకులు డాక్టర్ పులపర్తి పైడిరాజు, బి.రాజు, డాక్టర్ ఆర్.వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కళాశాలలో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ శాస్త్రి, రాజనీతిశాస్త్ర ఉపన్యాసకులు బి. రాజు, చరిత్ర ఉపన్యాసకులు ఎం. రామ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

తూటిపాలలో..

మాకవరపాలెం: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్, గుర్రం జాషువా జయంతిని మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

నర్సీపట్నం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గుర్రం జాషువా జయంతి కార్యక్రమం నిర్వహించారు. జాషువా చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రాజు, అధ్యాపకులు పులమాల వేసి నివాళులర్పించారు. జాషువా మూఢ విశ్వాసాల నిర్మూలనకు కృషిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

బుచ్చెయ్యపేట : మండలంలో గల తురకలపూడి గ్రామంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను శనివారం ఘనంగా ప్రారంభించారు. అమ్మవారి ఉత్సవరాట మహోత్సవంలో అధిక సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా అమ్మవారి ఉత్సవరాట వేసి దసరా ఉత్సవాల పనులను ప్రారంభించారు. ఉత్సవరాట వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ నాయకులు పాల్గొన్నారు.

దుర్గా భవానీ సేవా పీఠంలో..

కె.కోటపాడు : డి.అగ్రహారంలో గల దుర్గా భవానీ సేవా పీఠానికి చెందిన భవానీ మాలధారులు శనివారం దుర్గాదేవి విగ్రహం ఏర్పాటు చేశారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అక్టోబర్ 11 వరకూ దుర్గాదేవికి పూజలు నిర్వహించనున్నట్లు భక్తులు పేర్కొన్నారు. వేచలపు పైడంనాయుడు, లెక్కల నాయుడు (సామిల్లు), లెక్కల ముత్యాలనాయుడు, బల్లంకి చంద్రరావు, రెడ్డి రవికుమార్ పాల్గొన్నారు.



తురకలపూడిలో ఉత్సవరాట మహోత్సవంలో పాల్గొన్న మహిళలు

జిల్లా పోటీలకు ఎంపికైన గవరవరం విద్యార్థులు

చోడవరం రూరల్ : మండలంలోని గవరవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు జి.జె.సుందర్ సింగ్ తెలిపారు. శనివారం రావికమతం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్ 17 విభాగంలో పడాల సురేంద్ర వాలీబాల్ జట్టుకు, హైజంప్ పోటీలకు, సలాది వెంకటేష్ 400 మీటర్ల పరుగు పోటీకి, సబ్బి చందు వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు వేంపాడు మోహన్, సహకరించిన డ్రాయింగ్ టీచర్ నానుబిల్లి నాగరాజు, ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు. వీరు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.



పడాల సురేంద్ర సబ్బి చందు వెంకటేష్

ఆర్డీవో జయరాంకు సత్కారం

నర్సీపట్నం : బదిలీ అయిన ఆర్డీవో హెచ్.వి.జయరాంను తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఏడాదిన్నరకు పైగా ఆర్డీవో జయరాం సేవలందించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయనకు అమరావతికి బదిలీ అయింది. ఆయనకు శనివారం వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఆర్డీవో కార్యాలయ ఏవో సూర్యనారాయణ, తహసీల్దార్లు రత్నం, శ్రీనివాసనాయుడు, సిబ్బంది ఆర్డీవో జయరాం సేవలను కొనియాడారు. అనంతరం ఆయనకు జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు.